ప్రమాదీచ 1973 ఉగాది కథల పోటీలో మూడవబహుమతి పొందిన కథ

# పాలు ఎర్రబడ్డాది!

దేవరాజు మహారాజు – బి. విద్యాసాగరరావు

మోసుకొచ్చిన బట్టలమూట కిందేసేసరికి మల్లమ్మ ప్రాణం జివ్వుమంది. గాలిలో తేలిపోతున్నట్టు అలా చల్లని నీళ్ళలో ఈదుతూ వెళుతున్నట్టు అనిపించింది. మోసుకొచ్చిన మూటచూసి "గింతమూట మోసినా–" అని భయపడింది. "ఉట్టిగ మోస్తనే గీ తీర్గ మొస రాబట్టె, యిగ గిన్ని బట్టల్నేడ ఉతుకుత!"– అనుకుంటూ నదిలోకి దిగి నీటిమట్టానికి ఎత్తుగా వున్న ఓ రాయి మీద కూర్చుంది.

మల్లమ్మ, బట్టల మూటల ప్రతిబింబాలు నీళ్ళలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె ప్రతిబింబాన్ని చూసుకుంటే ఆమెకే ఎందుకో చెప్పలేని అసహ్యం వేస్తోంది. పదేళ్ళ క్రింద. ఆమెకు పదహారేళ్లున్నప్పుడు ప్రపంచం చాలా బాగుండేది. యిష్టమయితే యింట్లో పని చేసేది, లేక పోతే లేదు. సినిమాలు మాత్రం బోలెడు చూసేది. అందులో ఆడుతూ, పాడుతూ ఎగిరే ఆడవాళ్ళని చూసి, తనూ అలాగే వుండాలనుకునేది. కాని కష్టపడుతూ, ఏడుస్తూ వుండేవాళ్ళను చూసి, తన బ్రతుకు అలా అవుతుందని ఎన్నడూ ఊహించనైనా లేదు.

అప్పుడప్పుడు ఈశ్వరయ్యొచ్చి "మల్లీ నవ్వే మల్లి!!" – అని వెంటబడితే చెప్పలేని యిదయ్యేది. విరబూసిన పువ్వులా వుండే ఆమె ఈశ్వరయ్య ముందు సిగ్గుతో ముడుచుకుపోయి మొగ్గయ్యేది. ఈశ్వరయ్య వదిలేవాడు కాదు. "పెంకె ఘటం" అని అనేది. బుగ్గల్ని ఉబ్బించి– ఉబ్బించిన బుగ్గల్ని పిండి పిండి పొయ్యేవాడు. ఎర్ర గులాబీలయ్యేవవి. అద్దంలో చూస్తూ కూచుంటే పొద్దు తెలిసేదికాదు అలాగే కూచోవాలనిపించేది. ఈశ్వరయ్య బావ లేని వెలితి జ్ఞాపకమొస్తే ఆ ఎరుపూ పొయ్యేది ఆ అందమూ పొయ్యేది, మరి అంత అందమూ తన దగ్గరలేకుండా ఏమైంది?– ఈశ్వరయ్య కళ్ళల్లో. గుండెలో నిండిపోయింది.

నదిలో బట్టలుతికే వాళ్ళు వుతుకుతున్నారు. స్నానాలు చేస్తున్నారు కొందరు. చేపల కోసం వచ్చారు మరికొందరు. యివేవీ పట్టించుకోవడంలేదు మల్లమ్మ. ఏవో జ్ఞాపకాల నీడల్లో విశ్రాంతి తీసుకుంటోంది. మూసీనది ఒడ్డుకు బ్రిడ్జిక్రింద వున్న శంకరుని గుడి అరుగు మీద కుంటివాడు బట్టలు ఆరవేసుకుని, చుట కాల్చుకుంటున్నాడు. అతన్ని చూడగానే మల్లమ్మకు భయమయింది. తన భర్త ఈశ్వరయ్య జ్ఞాపకం వచ్చాడు.

కాలు బాగా నయంకాకపోతే, తన భర్త అలాగే అవుతాడా? ఏమో.... అతడి మొండికాలును చూసి జడుసుకుంది.

భయంకరమైన వాటిని చూస్తేనే భయం కలుగుతుందనడం పొరపాటు. మన మనసు ఎదుటివస్తువుపై ఏర్పరచుకున్న అభిప్రాయాన్నిబట్టి వుంటుంది అనుభూతి.

నాలుగైదు రోజులక్రితం ఈశ్వరయ్యకు ఏక్సిడెంట్ అయ్యింది. కాలు బాగా దెబ్బతింది. ప్రమాదస్థితిలో వున్నాడు. గవర్నమెంట్ హాస్పిటల్లో కట్టుకట్టారు. మందులు, ఇంజక్షన్లూ రాసిచ్చారు. పాలూ బ్రెడ్డు తినాలన్నారు. అన్నీ విన్నారు. ఈశ్వరయ్య, మల్లమ్మ–యింటికొచ్చాక ఏవీ ఆచరణలో పెట్టలేదు; పెట్టడానికి నిలవడబ్బేదీ? రోజు రోజు రెక్కల్ని విరగ్గొట్టుకుని, కుటుంబాన్ని లాగేస్తున్నవాడు చెమట లోంచి తిండి పుట్టించేవాడు ఈశ్వరయ్య.

అంతకు పది రోజుల ముందే మల్లమ్మ ఆడబిడ్డను కనింది. యిక చాలు కనొద్దు అనుకున్నా కాలుజారింది మళ్ళీ– అందుకే కనింది. పాప ఎర్రగా బొద్దుగా లేదు. మల్లమ్మ మాతృ హృదయం పాపను దగ్గరికి తీసుకుని గుండెలకు హత్తుకునేట్లు చేయడం తప్పించి, వేరే ఆకర్షణ లేవీ లేవు. చాలా బలహీనంగా వుంది. ఫ్యాక్టరీ వస్తువులు తయారయ్యేప్పుడు అందులో చెడిపోయిన స్పెసిమన్ లాగుంది. కాని కళ్ళలో ఏదో వెలుగు వుంది.

బ్రిడ్జిపై గట్టిగా హారన్ ఇస్తూ, భయంకరంగా దూసుకు పోతున్న లారీ శబ్దానికి అటు చూసింది. మల్లమ్మ పురానాపూల్ మీద అన్ని రకాల వాహనాలు నెత్తినోరూ మొత్తుకుంటున్న గోల....ఓ క్షణం అటే చూసేసరికి, బిడ్డ ఏడుస్తూ చేతులు, కాళ్ళు కొట్టుకుంటున్న దృశ్యం జ్ఞాపకం వచ్చి లేచింది. ఇంతింత పొడుగ్గా గాలాలు పట్టుకున్నవాళ్ళు తన పతి ప్రాణాలు తీసుకెళ్ళే యమదూతల్లాగా కనిపించారు. అంతవరకు ప్రశాంతంగా వున్న నీళ్ళలో ఏదో భయంకర శబ్దం వినిపించింది. నీళ్లు ఆమెను గుంజేసుకున్నట్లు భ్రాంతి చెంది కెవ్వున కేకేసి ఒడ్డువైపు పరుగుతీసింది.

* * *

ఎవరో మొహంమీద నీళ్ళు చల్లుతున్నట్టనిపించింది– మల్లమ్మకు! మెల్లగా కళ్లు తెరిచింది. ఎదురుగా శంకరాలయంలోని స్తంభం కనిపించింది. ప్రక్కకు తిరిగితే అతను – అతను–కుంటివాడు ....

లేచి కూర్చుని గాబరా పడిపోతోంది. మొహమంతా చెమట. "ఎవలూ?"– అంది. బట్టలమూట తనప్రక్కనే కనిపించింది.


"నీకెట్లుంది? నడుస నడుస్త.పడిపొయినవ్–'అంటున్నాడతనుఎదురుగా... పురానాపూల్ మీదఅదేగదరంగోళం..కుంటివాడైనా ఎంత బలిష్ఠంగా వున్నాడు.తన భర్తలాగా.. వద్దనుకున్నా. ఏదో అపశకునాన్ని జ్ఞప్తికి తెస్తోంది మనసు. బట్టలమూట తీసుకుని వెళ్ళడానికుపక్రమించింది మల్లమ్మ.

"చేతగానిదిఎందొక్కచ్చినవమ్మా-గన్ని బట్టలీసుకొని?"– అతడాదరంగా, సానుభూతిగా మాట్లాడుతున్నాడు. కాని అవి ఆమెకు బాధను కలిగిస్తున్నాయి. అతన్ని మరోసారి చూడ్డానికైనా సాహసం లేదు.

వూగుతున్న మొండికాలు.... భయం!!
గబగబా అక్కడినుండి పరుగులాంటి నడక ప్రారంభించి, యింటివైపు దారి తీసింది.

"దూద్ బౌలీ"లో చిన్న గుడిసె!

యింటిముందు. చిన్నకూతురు నిల్చుని ఏడుస్తోంది దానికో ఏడేళ్ళుంటాయి. అమ్మకోసం ఎదురు చూస్తోంది. పెద్ద కూతురు ఇంటిపనులేవో చూసుకుంటోంది.



దానికో పదకొండేళ్ళు! నాలుగేళ్ళ కిట్టుగాడు అన్నం పెట్టమని ఏడ్చి ఏడ్చి చాప మీద నిద్రపోయాడు. బ్రతికున్నానని తెలియజేస్తున్నట్లుగా ఈశ్వరయ్య నిండా కప్పుకుని మూలుగుతున్నాడు. కొత్తగా పుట్టినబిడ్డ ఏడ్పునే తాగేసి పడుకున్నట్లుగా వుంది.

ఇంట్లోకొచ్చి పరిస్థితిని చూడగానే, మల్లమ్మ కెలాగో అయింది. కిట్టుగాడి ప్రక్కకు బొంతపరిచి. వాణ్ణి అందులోకి బొర్లించింది. వాడి చెంపకు చాపగీరలు అచ్చొత్తినట్లు—ఎట్లాగో అయింది. ఆమె కెంతో బాధేసింది. యిక యింట్లోపనులు చేసుకుందామనుకుంది. వీలయింది కాదు. అవయవాలన్నీ యెటో పోతున్నట్లు నీరసం—అలాగే కిట్టుగాడి ప్రక్కకు చాపలో పడిపోయింది.

"అమ్మా. ఎట్వోయినవే? గింత సేపు? శెల్లె పాలకోసం ఏడ్శి ఏడ్శి పన్నది. గింతశేపెట్వోయినవె" — పెద్ద కూతురు లోపలి గదిలోంచి వచ్చి అడిగింది.

"ఉన్న మిరిద్దరు మబ్బుల పని శేశే టందుక్క పోతిరి. ఇగ సంటిది శీదర జేసొక్కబట్టె. గుడ్డలుతొక్కుద్దామనిపోయిన. గని శాతగాలె ఉత్తగనే వొచ్చినా—" మల్లమ్మ ఆయాసంగా చెప్పింది.

"గీ పక్కింటి అడంకొచ్చి, మియమ్మ యాడవాయుండే వొళ్లు బాగలేదు. యింక బాలితరాలు గటదిగ్గుతె ఎందుక్క మంచిది? అని బొల్లివెట్టి పొయ్యింది.—" అని చెప్పింది పెద్దకూతురు. చిన్నది దగ్గరి కొచ్చి తల్లి కడుపులో తల పెడ్తూ పడుకుంది. మల్లమ్మ ఏమీ మాట్లాడలేదు. కడుపులో ఏదో దేవినట్లవుతోంది. అందుకే దగ్గరికొచ్చిన చిన్నదాని చేతులు నిమిరి "పాపిష్టి దాన్ని బిడ్డా! మీరెక్కల కష్టం తింటున్నం-" అని కంట నీరు పెట్టుకుంది.

"అమ్మా—" అంది బిడియ పడుతూ పెద్దబిడ్డ.

"ఏందే?"

"నేన్ పన్జేసేయింటి అమ్మగారికి కొడుక్క బుట్టిండు........ ఓగాయాల్ల. నీ కెర్కనానె."

మల్లమ్మ విని వూరుకుంది.

## పాలు ఎట్లబడ్డాయ్!

"అమ్మగారు నిన్ రమ్మన్నరు."

"ఎందుకు ?— ఈ నెల జీతం నీతోని పంపిద్దదా?"

"ఏమోఁ నాకెర్కల్వదు. యియ్యాల్లప్పట్కి రమ్మన్నరు."

"ఊఁ." అంది మల్లమ్మ. ఉదాసీనంగా. ఆలోచనలన్నీ ఎటో పోబోతున్న సమయంలో బిడ్డ మళ్ళీ అంది.

"అమ్మా."

"ఏంద్బిడ్డా"— అనురాగంతో అంది తల్లి.

"నాయనకు మందులెట్ల?...."

మల్లమ్మ మాట్లాడలేదు. మాట్లాడే యత్నమూ చెయ్యలేదు. కూతురే మళ్ళీ చెబుతోంది. "యియ్యాల దవాఖాన్ల శెప్పిండ్రు. గిట్లయితే లాభంలేదు పైసకర్సు సేసుకుంటె పానం దక్కుతది మందులు దెచ్చుకొని ఆడుండ్రి అని."

భర్త తన ప్రాణం. అతను లేకుంటే తనుండలేదు, తన జీవితం వృధా. అతను కళ్ళెదుట వుంటే గంజి తాగినా. తాగక పోయినా బతకొచ్చు. కనిపించకుండా పోతే గుండెల్ని పిండేసే భయం. అలా జరుగ కూడదు. బ్రతకాలి యింకా చాలా యేళ్ళు — అసలు తనే ఆయన చేతుల్లో ప్రాణం వదిలేయాలి. మరి పెనిమిటి బ్రతుక్కు మందులు కావాలి. మందులకు డబ్బు కావాలి. ఎలా? ఎలా?—వివిధ రకాలుగా ఆలోచనా పరంపరలు అంతూపొంతూ లేకుండా— ఎంత ఆలోచించినా లాభంలేదు. డబ్బు సంపాదించే మార్గం కనిపించడం లేదు. ఇంట్లో వేవైనా అమ్ముదామంటే ఏమున్నాయ్. రాతివెండిగిన్నెలు, కుండలు తప్ప.

పొయ్యిమీద ఏదో పొంగిన చప్పుడయితే, లోనికెళ్ళింది. పెద్ద కూతురు. మల్లమ్మ బలహీనతకు, డబ్బుకు, భర్త ఆరోగ్యానికి, మందులకు, పరిష్కార మార్గాలు మెల్లమెల్లగా చెపుతోంది నిద్ర॥

* * *

"మల్లమ్మా వచ్చేశావా రా!"—సాదరంగా పిలిచింది రమణి తన గదిలోకి—

మెల్లగా అడుగు లేస్తున్న మల్లమ్మను మళ్ళీ అడిగింది.

"నీ బిడ్డెలాగుంది? — పేరేం పెట్టావ్"

"బాగానే వుందమ్మా యేవోఁ పిల్సినట॥" ఉదాసీనంగా అంది,

"ఏవీఁ లేదు, నిన్నో విషయం అడగాలి, ఒప్పుకుంటావో లేదో— నాకు పాలు పడటం లేదు మల్లమ్మా. మార్కెట్లో దొరికే పాల డబ్బాల పాలు పొయ్యొద్దన్నాడు డాక్టరు. తల్లిపాలే కావాలిట—



మర మనిషి

చిత్రం : కాళోజీ, నల్లగొండ

అందుకే నిన్ను పిలిచాను. నీ దగ్గరుంటాయి కదా పాలు అని॥

మల్లమ్మకు కొద్దిగా అర్థమయింది, యజమానురాలి మాటల తాత్పర్యం.

"ఎంతడబ్బైనా ఇస్తాను మల్లమ్మ. నీకు పుణ్యం వుంటుంది. రోజూ మూడుసార్లు నా ఈ చంటోడికి పాలిచ్చి వెళ్ళు....నీకు తెలుసుగదా, లేకలేక పుట్టాడు వీడు. ఎలా బ్రతికి బయటపడతాడో ఏమో" తనలో గొణుక్కుంటున్నట్లు గొణుక్కుంటూ తన కొడుకు కళ్ళలోకి చూసింది.

అమ్మగారి కొడుక్కు పాలిస్తే డబ్బు దొరుకుతుంది. డబ్బుతో మందులు, మందులతో భర్త ఆరోగ్యం చేకూరుతుంది. డబ్బుతో అవసరాలు తీరుతాయి. మరి నా చిట్టిదానికి పాలూ?... ఏదైనా తాపి, బ్రతికించొచ్చు. మొండిప్రాణాలంత తొందరగా పోవు.— అని ఆలోచిస్తూ అంది— "నా పెన్మిటికి తాబియతు బాగలేదు పురాగ...."

"అవునవును. నీ బిడ్డ చెప్పింది. పాపం ఈశ్వరయ్య మంచోడు. మంచోళ్ళకే కష్టాలొస్తాయి. ఇంజక్షన్సుకు డబ్బుల్లేకుంటే నేనిస్తాను. తీసుకెళ్ళు. బ్రతికించు— లేకుంటె దిక్కులేని దానివై పోతావ్"— అంది రమణి.

ఆమె దేవతా స్వరూపిణిగా అనిపించింది మల్లమ్మకు.

రమణి మెల్లగా లేచి గోడ వారగా నడుస్తూ పక్కగదిలోకిపోయింది. మల్లమ్మ మరో రెండడుగులు ముందుకేసి. యజమానురాలి కొడుకును చూసింది. ఎర్రగా బొద్దుగా వున్నాడు. తప్పిస్తే, మొహం అంత ఆకర్షణీయంగా లేదు. కళ్ళలో వెలుగు లేదు. పేలవంగా వున్నాయి. అయితే నేం యితను పెద్దవాడై ఈ బంగళాకు, ఆస్తికి. ఖరీదైన ఫర్నీచరుకు, అన్నింటికి వారసుడౌతాడు. తన బిడ్డ లాగా చిట్టిపోయిన కుండలకు వారసురాలు కాదుగదా. ఎలా వుంటే నేం అనుకుంది మల్లమ్మ. పక్క గది లోంచి బీరువా తీసి మళ్ళీ వేసేసిన శబ్దం వినిపించింది. అమ్మ గారొస్తున్నట్లున్నారనుకుని మళ్ళీ వెనక్కి జరిగి లోగడ నిలబడిన స్థలంలో నిలబడింది.

"ఇదిగో మల్లమ్మా యాభై రూపాయలు వుంచు—" గదిలోకి వస్తూ అంది.

"మొదలే యిస్తున్నారు—" తల వంచుకుని అంది మల్లమ్మ.

"ఎప్పుడైతేనేం. మీ ఈశ్వరయ్యకు మందులకు కావాలిగా, తీసుకో అశ్రద్ధ చెయ్యకు. ఇంకా అవసరం పడినా అడుగు ఇన్నేళ్లుగా మా యింట్లో పని చెయ్యడానికి ఇద్దరి బిడల్ని తోలిస్తున్నావు. ఆమాత్రం అడగడానికి నీకు స్వాతంత్ర్యం లేదూ ?" కళ్ళలోకి సూటిగా చూస్తూ అందిర మణి.

స్వాతంత్ర్యం విషయం తెలీదు మల్లమ్మకు, పని సరిగా చేయరు వాళ్ళను తోలించకు— నువ్వేరా అంటూ ఎప్పుడూ కోపగించే యజమానురాలు ఇవాళ వాళ్ళగురించి ఒకింత సానుభూతిగా మాట్లాడ్డం కొత్తగా అనిపించింది ఆమెకు. అయినా ఏమీ మాట్లాడలేదు. తన భర్త కోసం రూపాయలు కావాలి. చూస్తూ చూస్తూ వద్దనే సాహసంలేదు. అందుకే చెయ్యి చాచింది. ఆ చాచిన చెయ్యి ఎవరికో చెయ్యరాని ఘోరం చేసేందుకు ముందుకు జరిగినట్లు అనిపించింది. మల్లమ్మకు. అసలే తన చంటిది బలహీనంగా వుంది. దాని నోటి దగ్గరి పాలు అమ్ముతున్నానే. అని తన స్థితి తనకే అసహ్యాన్ని కలిగిస్తోంది.

"మీ పైస మితాన్నే వుంచుకొండ్రి" బీదోల్లతోని ఆటాడ్తారెందుకు—" అని విసిరేయాలన్న ఉక్రోషం మనసులో కలుగుతోంది. అయినా. మల్లమ్మ చప్పుడు చెయ్యలేదు, డబ్బు చేతిలోకి తీసుకుంది. చేతిలో కొచ్చిన మరుక్షణంనుంచి చేతుల్ని వణికిస్తుంది డబ్బు. "డబ్బంటేగా పోవ్వల్లు" అని అర్థం తోచింది మల్లమ్మకు—

"అప్పటిక్కి రానా అమ్మా:"

"మంచిది వెళ్ళిరా—ఇప్పుడోసారి ఇచ్చి వెళ్ళరాదూ పాలూ—" అంది యజమానురాలు రమణి.

ఈ ఒక్కపూటైనా తన చంటిదానికిచ్చొద్దామనుకుంది. కాని ఈమె డబ్బిచ్చిన అమ్మగారు— వెళ్ళమన్నట్టే అని మళ్ళీ పాలిచ్చి పొమ్మంది. ఈ ఒక్కసారికూడా ఎందుకు పోవాలనుకుందేమో.. నిజానికి మల్లమ్మకు కష్టం కలిగింది. అయినా సరే ఇచ్చి వెళతానని, మంచం దగ్గిరిదాకా వెళ్ళింది. బాబును చేతుల్లోకి తీసుకుని మంచం పక్కనే కూర్చుంది పాలివ్వడానికి. బాబు గబగబా పాలు తాగుతున్నాడు ఆమె ఆత్మ విశ్వాసాన్ని. అసహ్యతను తాగుతున్నాడు.

ఆమె దగ్గర పాలెన్ని వున్నాయో అంతకు పదిరెట్లు కన్నీళ్లున్నాయి. కాని కన్నీళ్ళకు ఖరీదుకట్టి ఎవరూ తీసుకోరు.

ఐదు రోజులు. గడిచాయి. మల్లమ్మ బిడ్డలు యథాప్రకారం యింటిపని చేస్తున్నారు మల్లమ్మ యజమానురాలి బాబుకు పాలిస్తోంది— యజమానురాలు డబ్బిస్తోంది. డబ్బులవల్ల మందులు దొరుకుతున్నాయి. ఈశ్వరయ్య ఆరోగ్యంపుంజుకుంటున్నాడు. లేచి కూచో గలుగుతున్నాడు. మూలుగు లేదు మాట్లాడుతున్నాడు. ఇంతరొట్టి తింటున్నాడు — కిట్టుగాడు అన్నం అని ఏడ్చి పడుకోవడంలేదు. వాడికింత పెడితే తిని ఎంచక్కా గెంతుతున్నాడు.

కాని, ఒక్క చంటిది ! !

విపరీతంగా ఏడుస్తోంది. ఆ ఏడ్పు తనను కన్నవాళ్ళను శపిస్తున్నట్లుగా వుంది, అసలెవరు కనమన్నారు. పెంచుకొవడం చేతకానిది కనడమెందుకు? అని అంటున్నట్లు వుంది ఆ ఏడ్పు — ఈశ్వరయ్యకు.

బిడ్డలూ, భార్య యింట్లో వుండరు. ఆ యేడ్పు తనే వినాలి. భరించాలి. లేచి సముదాయించే స్తోమత తన దగ్గర లేదు. పక్కింటి వాళ్ళందరూ వచ్చి తనను. భార్యను తిట్టి వెడుతున్నారు.

పెద్ద కూతురు. ఎక్కడివో ఆ పాలూ, ఈ పాలు తెచ్చిపోస్తుంది. కాని ఆ పసిప్రాణానికవి పడవు పరిస్థితులు కుదుట పడినందుకు సంతోషించినా. పసిదాని ఏడ్పులో నరకం కనిపిస్తోంది ఈశ్వరయ్యకు. యజమానురాని ఇంట్లో పాలెందుకు ఇచ్చొస్తున్నావని అడిగే తాహతు లేదు తనకు. తను ఇప్పుడు నామమాత్రానికే ఇంటి పెద్ద. అందులో తన ఆరోగ్యం కోసమే మల్లమ్మలా చేస్తోంది. అప్పుడప్పుడే యోగ్యత కూడా లేకుండాపోయింది పెళ్ళయి యిన్నేళ్ళయినా. మల్లికి నామీద ప్రేమ తగ్గలేదు. నిజంగా అది దేవత"— అనుకున్నాడు ఈశ్వరయ్య.

మల్లమ్మ బిడ్డను చూడ్డంలేదు. చూసే తీరికా లేదు. పెద్దకూతురో. చిన్నకూతురో చూస్తుంటారు. ప్రాణం ఆగక అప్పుడప్పుడు చేతిలోకి తీసుకుని, హత్తుకుని. పాలిద్దామని ఉపక్రమిస్తుంది. కాని డబ్బు తీసుకుని ద్రోహం తలపెడ్తున్నానా అని భయం కలుగుతుంటుంది. బిడ్డను దూరం జరుపుతుంటుంది. ఆ కాసింతలోనే నా చంటిదాని నోట్లో కిన్నిపాలు వచ్చేవికావు ఉన్నవన్నీ అక్కడ అమ్ముకుని వచ్చాక యింకా ఏం మిగులుతాయి?

కాని క్షణంలో చంటిది— తల్లిపాలు కాదు, రవ్వంత ఆప్యాయత నోటికందినట్లు వూరుకునేది.

చంటిబిడ్డనక్కడ వదిలేసి, భర్తకేసి తిరిగి "గోలీ తీసుకుంటివా?" — అడిగింది.

"ఆఁ— యిందాక యింజీసనుగూడ చేపిచ్చుకున్న"—ఈశ్వరయ్యన్నాడు.

మల్లమ్మెందుకో గట్టిగా నిట్టూర్చింది—

"ఇగ జూసినవా. కాలు సక్కగొస్తాంది"—ఈశ్వరయ్య మాటల్లో సంతోషం చిలికింది.

మల్లమ్మ కళ్ళలో యేవో వెలుగులు దొర్లాయ్ సాయంత్రమౌతోంది—

గబగబా లోనికెళ్ళిపోయింది యింటి పనులు చూసుకుందామనుకుని, యేం చేస్తోందో ఏమో గిన్నెలుతోమిన చప్పుడు, కుండల చప్పుడు వినవస్తోంది ఈశ్వరయ్యకు, కళ్ళు మూసుకుని ఇంటి కప్పు చూశాడు. అది పూర్తిగా వంగి కూలేట్లుంది. అయినా కూలడంలేదు. తన బ్రతుకులాగా. అసలు ఈశ్వరయ్య ఇదంతా కూలగొట్టి కొత్తగా కట్టాలనుకున్నాడు మొదట్లో— బ్రతుకు నడవడమే కష్టమైనందువల్ల ఆ యత్నం మానుకున్నాడు.

చంటిది ఏడుపు మొదలెట్టింది. కడుపులోకి ఆసరాలేంది ఏడ్చేందుకంత శక్తి ఎలా వస్తుందో ఏమో అర్థంకాలేదు ఈశ్వరయ్యకు. తను ఏమీ చెయ్యలేని వాడు. అందుకే కళ్ళు గట్టిగా మూసుకుని అటు తిరిగి పడుకున్నాడు.

లోపలినుండి మల్లమ్మొచ్చి పగిలిన కప్పులోంచి ఏదో త్రాగించబోయింది. అది త్రాగడంలేదు. కాళ్ళు చేతులు విపరీతంగా కొట్టుకుంటోంది. పాలివ్వాలి—మాతృహృదయం కొటుకుంటోంది. అయినా గుండె రాయిచేసుకుంది. బాగా బాధపడుతోంది.

"పెర్గిన యిద్దరి బిడ్డల పెల్లిల్లు సెయ్యాల. కిట్టుగాడికింత సద్యు సెప్పెయ్యాల. దిన దినం తిండికే ఎంతో యిదవుతోంది. యిది పుట్టకున్నా బాగుండె. దురదుష్టపుది తల్లి పాలన్నా తాగ నోసుకోలేదాయె — నేనేం పాపం జేసినో్న" — అని బాధపడుతోంది.

నివారణోపాయం ఏదీ దొరకడంలేదు. చంటి దేడుస్తోంది.

పొట్టవోయి, వంకర్లు తిరిగిన రాతి వెండి కంచంలో ఇంత అన్న పెట్టుకుని వచ్చి భర్త ముందు పెట్టి. లోపలికి వెళ్ళి. తానింత తినబోయింది. బయట చంటిదేడుస్తుంటే తినాలనిపించలేదు. తన మీద తనకే రోతపుట్టింది. ఆ క్షణం నిజంగా చచ్చిపోదామనుకుంది. "అమ్మగారి దగ్గర డబ్బు పుచ్చుకున్నదానివి బాబుకు పాలివ్వకుండా, మొగడు బాగవుతున్నాడని చచ్చిపోతావా దుష్టురాలా?"— అని కూడా అనిపించింది.

అన్నం అటుతోసి మూకుడు లాంటి గిన్నె కప్పి లేచి బయటికి వెళ్ళిపోయింది. ఈశ్వరయ్య లేచి అన్నం ముందు కూచున్నాడు. చంటిబిడ్డ అలా ఏడుస్తుంటే ప్రాణం తరుక్కుపోతుంది. "గిది గిట్లనే ఏడ్చి సస్తదా ఏంది, దీన్ని సంపిన పాపం కూడా సుట్టుకుంటదా ఏంది?" అని కన్నీళ్లు పెట్టుకున్నాడు పెద్దకూతుళ్లూ కిట్టుగాడూ ఇంట్లో లేరు— బయట బజార్లో రద్దీ ఎక్కువైంది. అందరూ ఇళ్ళకు చేరుకునే సమయం గదా....బస్సుల, లారీల హారన్లు వినవస్తున్నాయి.

మల్లమ్మ వేగంగా వచ్చింది బజార్లోనుండి— కొంత సేపటికి ఏదో దృఢనిశ్చయానికి వచ్చినట్లు ఆమె ముఖం !

ఏదో పరిష్కారమార్గం దొరికినట్లు ఆమె ముఖం గంభీరంగా అయింది. అందులో కొంత బాధ తొణికిసలాడుతూనే వుంది.

అప్పటికే చంటిది ఏడుపు స్థాయి తగ్గించి, సొమ్మసిల్లినట్టుగా అయింది— కళ్ళు మూతలు పడుతున్నాయి.

బిడ్డను దగ్గరికి తీసుకుంది మల్లమ్మ. ఆ తీసుకోవడంలో మాతృప్రేమ లేదు. ఏదో కర్కశత్వం వుంది. పాలిచ్చేముందు చేతిలోది ఏదో రొమ్ముకు పూసి మరీ


ప్రసవించేదాకా

"ప్రెగ్నిటోన్" ఉపయోగము

(రిజిష్టర్డ్)

ప్రథమ మాసముల వేవిళ్ళు. వాంతులు. మధ్యమాసముల నీరుచూపుట. నీరసము. గర్భస్రావ భయము. తర్వాత మాసముల గర్భవాతము.రక్తహీనత, అకాలప్రసవము వీటినుండి రక్షించుచు. సుఖప్రసవము నిచ్చును.

అన్ని మందుల షాపులలో లభించును.

ఓషధి ఫార్మస్యూటికల్స్.

గుడివాడ. (క్రిష్ణా)

## పాలు ఎఱ్ఱబడ్డాయ్!

చంటిదాని నోట్లో పెట్టింది. ఈశ్వరయ్య చూశాడు. ఏదైనా అందామని అనుకున్నా నోరు పెగల్లేదు. తల మోకాళ్ళలో పెట్టుకుని అలా అన్నంవైపు చూస్తున్నాడు. ముందరి అన్నం ఎవరో గుంజుకు వెళుతున్నట్టు అనిపించింది. మనసులోని సుడిగుండాల్ని అదిమి పెట్టగలుగుతున్నాడు గాని కళ్ళలోని నీళ్ళు? — ఓ బిందువు ముందున్న అన్నం కంచంలో పడింది.

పసిది ఆత్రంగా తాగింది. పాలు ఏటో అనిపించినా ఆకలి! — తొందరగా తాగాలని ఆరాటం. గొంతు పట్టుకున్నట్టుంది. దగ్గింది. ఏడుపు పూర్తిగా ఆగింది. కళ్ళు మూతలు పడిపోతున్నాయ్ చంటిదానికి.

మల్లమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు నిండాయి. అవి సానుభూతిగా కారాయో, తన అసహాయతను తెలిపేవో లేక పశ్చాత్తాపానికి ఫలితంగా కారాయో తెలీదు. ఓ రెండు చుక్కలు పసిదాని చెక్కిళ్ళమీద పడ్డాయ్. ఉలిక్కిపడి కళ్ళు తెరిచి కాళ్లూ చేతులూ కదిలించి మళ్ళీ మూసుకుంది.

బొంతలో బిడ్డను అలా పడుకోబెట్టి, యజమానురాలి బాబుకు పాలిచ్చే వేళయిందనో లేక అక్కడ వుండడానికి భయమేసిందో తెలీదు—మల్లమ్మ తక్షణం యజమానురాలి ఇంటికి బయలుదేరింది. దోవలో లైట్లక్రింద తన నీడ పొడుగ్గా అవుతున్నకొద్దీ తనలోని మాతృహృదయం తనను కబళించేందు కొచ్చినట్టు భయం—మళ్ళీ నీడ పొట్టిగవగానే తనలోని పతిభక్తితో సర్వాన్నీ జయించగలనన్న బిరుసుతనం—

మల్లమ్మ యిల్లు చేరేసరికి రమణి ఎటో తయారయినట్టుంది. నెత్తి విరబోసుకుని, నడినెత్తిలో ఓ రిబ్బను ముక్క కట్టుకుంది. బెల్ పాంటూ, షర్టూ, హైహీల్సులతో కనిపించింది. "అమ్మగారేసం ఏసుకున్నారనుకుంది" మల్లమ్మ. వొయ్యారం వొలికిపోతూ వుంటే ఎర్ర పెదాల్తో అంది:

"మల్లమ్మా, అయ్యగారు బయట రూంలో వున్నారు. ఇద్దరం బయటికి వెళ్తున్నాం. చాలా రాత్రవుతుంది. వచ్చేసరికి, వచ్చినా ఏస్థితిలో వుంటానో ఏమో చెప్పలేను. అందుకోసం తెల్లవారేదాకా బాబును చూస్తుండాలి .... ఊఁ—" అని అదోరకంగా తల తిప్పింది—"బాబు ఇప్పుడే లేచాడు వెళ్ళి చూడు" అంది.

"అమ్మగార్కి మళ్ళీ ఎప్పటోలె వొళ్లు తిప్పడం ఒచ్చింది" అనుకుంది మల్లమ్మ "ఒక్క రాత్రే యేంది యెప్పట్కి సూత్తొండ" అనుకుని "మంచిదమ్మగారూ"—




అంది. ఆ మాటల్లో గాద్గదికం రమణికేం తెలుసు? వెంట్రుకలు కదిలేట్టు తలతిప్పుతూ ఎత్తు చెప్పులమీద బొమ్మలా వెళ్ళిపోయింది అవతలి గదిలోకి—

నిజానికి అమ్మగారు మగోళ్ళలాగా అలాంటి బట్టలేసుకుంటె మల్లమ్మకిష్టం వుండదు. తిట్టుకునేది మనసులో. "నాకున్నంత యందమన్న నేదు. మొకంమీద మొగకల— దానికి తోడు ఆ లాగులు ధూ" ఈసడించుకునేది. ఎప్పుడైనా; కాని యిప్పుడు ఏమి అనుకో లేదు. అలా ఆలోచించాలనే ఆలోచనే రాలేదు. ఒక్కటి తన పసిబిడ్డ!!!

గుండె పగిలే భయం.

బాబు ఏడుపు మొదలెట్టిన శబ్దం వినవచ్చి అటు వెళ్ళింది. బయట కారు వెళ్ళిపోయిన శబ్దం వినవచ్చింది.

"మల్లమ్మా" అంటూ వచ్చింది వంటలమ్మ.

"బాబును పైన డాబా మీద బాల్కనీలకు తీస్కపో గాలికి" సలహా యిచ్చింది.

"మంచిది — ఏం వంటల్జేసినవ్"— అనడిగింది ఏదో మాట్లాడాలి కాబట్టి.

"ఏంలేదు. అల్లు నాత్రికి ఎన్నోస్తినో సరంట. ఈ పూట పన్లేదు. నువ్పా బంగ్లమీదికి నేన్గూడ ఒస్తాన" అంటూ లోనికెళ్ళిపోయింది వంటలమ్మ బరువైన శరీరాన్ని ఈడ్చుకుంటూ.

మల్లమ్మ బాబును తీసుకుని పైన బాల్కనీలో సోఫామీద పడుకోబెట్టి లోపలికెళ్ళి రొమ్ము బాగా కడుక్కనొచ్చింది. ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

బాబుకు పాలిస్తూ వుంటే, సంతోషం కొద్దీ త్రాగుతూ అప్పుడప్పుడు మల్లమ్మవైపు చూసి నవ్వుతున్నాడు. "నీ బిడ్డ ప్రాణాల్ని, ఆత్మను నాలో కలుపుకుంటున్నాను చూడూ" అన్నట్లుందా చిన్నారి నవ్వు.

ఆమె భరించలేకపోయింది. ఏదో భయంలోంచి మొస ఎగబోస్తోంది. బాబు నింపాదిగా ఇక నీ బిడ్డను నాలోనే చూస్కో అన్నట్లు గటగటా త్రాగుతున్నాడు.

పాలు పీల్చుతూ వుంటే, తన బిడ్డపంచప్రాణాల్ని పీల్చుతున్నట్టు, అనుభూతి.... ఆందోళన .... కళ్ళముందు యింటిలోని సంఘటనలు .... అందరూ బిడ్డచుట్టూ చేరి ఏడ్చేస్తుండొచ్చు—

కన్నీళ్లు మల్లమ్మ చెంపల్ని దాటిపోతున్నాయ్ .... ఒక్కసారి (చివరిసారి) తన బిడ్డను చూసుకోవాలనిపించింది. గబుక్కున బాబును ప్రక్కకు పడుకోబెట్టి లేచి ఏదో ఆవేశం ముందుకు తోస్తుండగా పరిగెడుతున్నట్లు మెట్లు దిగుతూ వుంటే— పాతచీర కుచ్చిళ్ళు కాళ్ళను పెనవేసుకున్నాయి.

ఇంకా వృధాగా ఎందుకు పోతావు? ఆ దృశ్యం నువ్వు అసలే చూళ్ళేవు వద్దు — అన్నట్లుగా. ఆ ప్రయత్నంలో చీర కుచ్చిళ్ళు చిరిగాయి, ఆమె శరీరం అదుపు తప్పి, మెట్లమీంచి జారి దొర్లుతూ, పడిపోతోంది. గాజులు పగిలి చేతి రక్తాన్ని బయటికి కక్కుస్తున్నాయి....

అక్కడ చివరి మెట్టుమీద ఆగింది. జీవితంలో పూర్తిగా దిగజారి, చివరి స్థితికి చేరుకున్నట్లు —

లేచే స్థితిలో లేదు, వళ్ళంతా ముద్ద అయింది, ఏ అవయవమూ కదిపేట్లు లేదు.

"నన్ను అన్యాయం చేసిపోకు— అన్నట్లు బాబు ఏడుపు, పైనుండి — మల్లమ్మకు వినవస్తోంది. కళ్లు తెరిచి పైకి చూసే యత్నంలో, ఆ తొందరలో రవిక కట్టుకోలేదని తెలిసి చేతితో అదుముకుంది—పాలు కారిపోతున్నాయ్!

పాలూ, చేతి రక్తమూ కలిసి, సన్నని ధారగా ఆమె కడుపు మీదుగా పారుతున్నాయి.

